నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల బుధవారం 3 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

పకడ్బందీగా తనిఖీలు చేయాలి

అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు

వాహనాలు తనిఖీ చేస్తున్న జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు

వాంకిడి, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు సూచించారు. డీఎస్పీ సదయ్యతో కలసి వాంకిడిలోని టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలు, రికార్డులను పరిశీలించారు. తనిఖీ కేంద్రాల వద్ద చెక్ పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. నగదు, మద్యం, గంజాయి, వరి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టడంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, కాగజ్ నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, వాంకిడి ఎస్ఐ సాగర్ తదితరులున్నారు.

నేరాలను అరికట్టేందుకే సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్

సైబర్ పోలీస్‌స్టేషన్ ను ప్రారంభిస్తున్న సీపీ

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 2: పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, బాధితులకు సత్వర సేవలు అందించేందుకే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఉపయోగపడుతుందని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. రామగుండం కమిషనరేట్‌లో ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్‌ను అధికారులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో పర్యవేక్షక అధికారిగా ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఒక హెచ్‌సీ, ఏడుగురు కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు. రూ. లక్షకు పైగా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉం టుందని తెలిపారు. రూ.లక్ష కన్నా తక్కువగా ఉన్న సైబర్ నేరాలపై బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సైబర్ క్రైమ్‌పై బాధితులు ముందుగా వెంటనే 1930కి కాల్ చేయాలని, www.CYBERCRIME. gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యాసంగి కొనుగోళ్లు జరిగేనా..?

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

● ఇంకా ఫైనల్ కాని పీపీసీలు... ● ఎన్నికల కోడ్ ఉన్నా ఎమ్మెల్యేలు చెప్పిందే ఫైనల్
● మంచిర్యాల నియోజకవర్గంలో పరిస్థితి మరీ అధ్వాన్నం ● ధాన్యం సేకరణ లక్ష్యంలోనూ కానరాని స్పష్టత

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 2 : మంచిర్యాల జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో కొనుగోళ్లు జరుగుతాయా! లేదా! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొన్ని గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమై కల్లాలకు చేరుతున్నా, కొనుగోలు కేంద్రం ఉంటుందా..లేదా తెలియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా అధికారులు రాజకీయ నాయకులు చెప్పిందే పాటిస్తున్నారు.

ఇంకా ఫైనల్ కానీ పీపీసీలు...

జిల్లాలో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో, హడావిడిగా సోమవారం 24 కొనుగోలు కేంద్రాలను నామ్‌కే వాస్తేగా ప్రారంభించారు. కాగా, జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారనేది ఇప్పటివరకు ఒక అంచనాకు రాలేదు. ఎన్ని ఏజెన్సీల ద్వారా కొంటారనేది స్పష్టత లేదు. సివిల్ సప్లయ్ శాఖ ఉన్నతాధికారిగా ఉన్న అదనపు కలెక్టర్ ఒక మాట చెబుతుంటే, పౌరసరఫరాల శాఖ అధికారులు మరో మాట చెబుతున్నారు. ఏ మండలానికి ఏయే ఏజెన్సీకి సంబంధించి ఎన్ని పీపీసీలు కేటాయించారో తెలుపకుండానే మొక్కుబడిగా కొన్ని కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపుకున్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నా ఎమ్మెల్యేలే ఫైనల్...

జిల్లాలో ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ సమయంలో రాజకీయ నాయకులతో సంబంధం లేకుండా అధికారులే అన్ని పనులు చేయించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఆ పరిస్థితి లేదు. ఒక ఎమ్మెల్యే మూడు ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలంటే, మరో ఎమ్మెల్యే నా నియోజక వర్గంలో ఒక ఏజెన్సీ ద్వారానే ధాన్యం సేకరించాలని ఆదేశాలు జారీ చేస్తుండడంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు. గతంలో ఎన్నికల సమయంలో అంతకు ముందు కొనుగోలు ఎలా చేశారో అదే ఏజెన్సీలతో కేంద్రాల్లో ఎలాంటి మార్పు లేకుండా ధాన్యం సేకరించేవారు. కానీ ప్రభుత్వం మారిన తర్వాత కోడ్‌తో సంబంధం లేకుండా ఎమ్మెల్యేలు చెప్పినట్లు అధికారులు చేస్తూ వెళ్తున్నారు.

మంచిర్యాల నియోజక వర్గంలో..

జిల్లాలో మూడు నియోజక వర్గాలతోపాటు ఖానాపూర్ నియోజక వర్గంలోని జన్నారం మండలం ఉంది. ఆయా చోట్ల కొనుగోలు కేంద్రాల కేటాయింపుల్లో చిన్న చిన్న మార్పులు జరుపుతున్నారు. మంచిర్యాల నియోజక వర్గంలో జిల్లా ఏర్పడిన నాటి నుంచి పీఏసీఎస్, డీసీఎంఎస్, డీఆర్‌డీఏ ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు జరిపారు. రైతులకు ఇబ్బంది ఎదురైతే కేంద్రాలను పెంచి మరి ధాన్యం సేకరించారు. కానీ ఈ సీజన్‌లో కేవలం డీఆర్‌డీఏ ఐకేపీ ఏజెన్సీతో కొనుగోళ్లు జరుపుతామని ఎమ్మెల్యే పీఏస్ఆర్ ప్రకటించడం, కోడ్ ఉన్నప్పటికీ అధికారులు ఆయన మాటకే తలొగ్గి ఒక్క ఏజెన్సీకే కేంద్రాలు కేటాయించేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు.

ధాన్యం సేకరణలోనూ కానరాని స్పష్టత

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 1.74 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. క్రాప్ బుకింగ్ పూర్తయిన తర్వాత అంచనా పెరిగింది. అయినా అధికారులు పాత టార్గెట్‌నే ఉన్నతాధికారులకు ఇస్తున్నారే తప్ప రివైజ్డ్ సమాచారం ఇవ్వడం లేదు. దీంతో గన్నీ బ్యాగుల కేటాయింపు, మిల్లులకు ధాన్యం కేటాయింపులో ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో ఎన్ని కేంద్రాలు, ఎన్ని ఏజెన్సీలతో ధాన్యం సేకరిస్తున్నారో, లక్ష్యం ఎంతో, లక్ష్యానికి సరిపడా గన్నీలు ఉన్నాయా! ఇలా దేనిలో స్పష్టత లేకుండానే కొనుగోళ్లకు సిద్ధమయ్యారు.

ఎన్ని ఫైనల్ చేస్తారో తెలియలేదు

జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 130 కొనుగోలు కేంద్రాలకు ప్రపోజల్‌కు పంపాం. ఇందులో కలెక్టర్ సీఎస్ ఇప్పటి వరకు ఎన్ని కేంద్రాలకు అప్రూవల్ ఇస్తారో తెలియలేదు. సోమవారం బెల్లంపల్లిలో ఏడు, చెన్నూర్‌లో ఐదు, ఖానాపూర్‌లో ఒక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. సెంటర్ ఫైనల్ అయ్యాక అన్ని కేంద్రాలనూ ప్రారంభించి ధాన్యం కొంటాం. మంచిర్యాల నియోజక వర్గంలో కేంద్రాలు ఇస్తారా.. అనేది ఇంకా అధికారుల నుంచి స్పష్టత రాలేదు.

- నర్సయ్య, జిల్లా సహకార అధికారి, మంచిర్యాల

పాత సెంటర్ల లిస్టు పంపించాం

ప్రతి ఏడాది మాదిరిగానే ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూర్, ఖానాపూర్(జన్నారం) నియోజకవర్గాల నుంచి పాత 90 సెంటర్ల లిస్టును అధికారులకు పంపించాం. అందులో నుంచి మంచిర్యాల మినహా మిగతా నియోజక వర్గాల లిస్టు పంపించాలని కోరగా, తిరిగి మూడు నియోజక వర్గాల నుంచి 43 కేంద్రాల లిస్టు పంపించాం. ఇందులో ఎన్ని కేంద్రాలను ఫైనల్ చేస్తారో ఇప్పటికీ ఖరారు కాలేదు. గతంలో కొనుగోళ్లకు ఇబ్బందవుతున్నదని అప్పటి అధికారులు సెంటర్లు పెంచి కొనుగోలు చేయాలంటేనే మా ఏజెన్సీ ద్వారా జరిపాం. ఇప్పుడు తగ్గించి పంపమంటే తగ్గించి ఇచ్చాం.

- ప్రమోద్, డీసీఎంఎస్ మేనేజర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

కోర్టు తీర్పునే బేఖాతర్

● సర్వే నంబర్ 42లో షెడ్ల నిర్మాణం వెనుక పెద్ద కుట్ర ● అధికారులకు తెలిసే పనులు నిర్వహించారనే అరోపణలు
● పాత నిర్మాణాలంటూ మభ్యపెట్టే యత్నం ● ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా.. అప్పనంగా కట్టబెడతారా..?

ఫిబ్రవరి 28న ఉదయం 11.12 నిమిషాలకు ఆరో షెడ్డు నిర్మిస్తుండగా నమస్తే తెలంగాణ తీసిన ఫొటో(కెమెరాలో కనిపిస్తున్న తేదీ, సమయం)

2021లో ఆదే భూమిలో కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్న అధికారులు(ఫైల్)

మంచిర్యాల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 42పై నమస్తే తెలంగాణలో మార్చి 22న ''ప్రభుత్వ భూమిలో ప్రైవేటు షెడ్లు'' శీర్షికన కథనం ప్రచురితమైంది. 8 గంటల ప్రభుత్వ భూమిలో దర్జాగా ఆరు షెడ్లు వేసిన వైనాన్ని కండ్లకు కట్టింది. దీనిపై స్పందించి పరిశీలనకు వెళ్లిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. మొత్తంగా ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున కుట్ర జరిగినట్లు స్పష్టం అవుతున్నది. కోర్టు తీర్పు నేపథ్యంలో అధికారులు మా నిర్మాణాలను కూల్చడానికి వీల్లేదంటూ అక్రమార్కులు చెబుతున్నారు. కానీ కోర్టు తీర్పును చూస్తే ఆ భూమిలో ఎవ్వరూ జోక్యం చేసుకోవడానికి లేదు. అది అధికారులైనా, అక్రమార్కులైనా.. అందరికీ వర్తిస్తుంది. అక్రమార్కులు ఇండ్లు కట్టుకోవచ్చని ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదు. మరి కోర్టు తీర్పు ఉండగా ఈ అక్రమ నిర్మాణాలు ఎలా చేశారనేది తేలాల్సి ఉంది. దీనిపై అధికారులను కలిసి వివరణ కోరితే అవి పాత నిర్మాణాలు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కట్టారు అని చెబుతున్నారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలు అయిపోయాకే డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఈ షెడ్లను నిర్మించారు. నమస్తే తెలంగాణ కథనంలో ప్రచురించిన ఫొటో ఫిబ్రవరి 28వ తేదీన తీసింది. ఇందుకు సంబంధించిన 'నమస్తే తెలంగాణ' కెమెరాలో ఫొటో తీసిన తేదీ, సమయం అన్ని పక్కాగా ఉన్నాయి. చివరి ఆరో షెడ్డు నిర్మిస్తున్నప్పుడు తీసిన ఫొటో అది. దాన్ని పట్టుకొని పాత నిర్మాణాలంటూ అధికారులు బుకాయిస్తుండడం వెనుక మర్మమేంటి అనేది అర్థం కావడం లేదు.

అధికారుల ఆలస్యమే శాపమా..

సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు షెడ్లు వేసిన ప్రతిసారి కేసీఆర్ గవర్నమెంట్ ఆ నిర్మాణాలను తొలగించింది. 2021లో ఒకసారి, 2023లో మరోసారి ఇదే భూమిలోని నిర్మాణాలను తొలగించారు. ఏదైతే కోర్టు తీర్పు ఉందని చెబుతున్నారో అందులో ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు లేవనే ఆధారాలు సమర్పించేందుకు కోర్టు అధికారులకు సమయం ఇచ్చినట్లు ఉంది. కానీ నిర్దేశిత సమయంలోగా దానికి కౌంటర్ వేయలేదని తెలిసింది. అదే కోర్టు అడిగినప్పుడు కౌంటర్ వేసి ఉంటే పరిస్థితి ఇక్కడి దాకా వచ్చేది కాదు. ఈ వ్యవహారంలో అధికారులు ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే పాత నిర్మాణాలు అని తప్పించుకోవాలని చూస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల కట్టిన షెడ్లను పట్టుకొని పాత నిర్మాణాలు అని చెబుతున్నారంటే, ఏదో పెద్ద ఎత్తునే జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ జోక్యమైనా ఉండి ఉండాలి లేదా అధికారులకు అమ్యామ్యాలైన ముట్టి ఉండాలంటూ ఆరోపిస్తున్నారు. లేకపోతే కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో, నస్పూర్ మున్సిపాలిటీకి వెళ్లే దారిలో, బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు పక్కనే కోర్టు కేసులో ఉన్న స్థలంలో షెడ్లు కడుతున్న విషయం తెలియకపోవడం ఏంటని మండిపడుతున్నారు. ఈ నిర్మాణాలు ఈ మధ్యే చేసినవనే ఆధారాలు కోర్టుకు ఇచ్చి వెంటనే ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా.. లేకపోతే నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎంతో విలువైన భూమిని అప్పనంగా అక్రమార్కులకు కట్టబెడతారా అనేది తేలాల్సి ఉంది.

కోర్టులో కౌంటర్ వేస్తాం

- శ్రీనివాస్, నస్పూర్ తహసీల్దార్

కోర్టు ఆర్డర్ ఉన్న మాట వాస్తవమే. కానీ నిర్మాణాలు చేసుకోమని మాత్రం కోర్టు డైరెక్షన్ ఇవ్వలేదు. ఎవ్వరూ ఆ భూమిలో జోక్యం చేసుకోవడానికి లేదు. కోర్టు తీర్పునకు మేం కట్టుబడి ఉన్నాం. ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. కోర్టులో కౌంటర్ ఫైల్ చేస్తాం. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఊరుకునేది లేదు. కచ్చితంగా మేం చేయాల్సింది చేస్తాం.

అక్రమాల్లో 'హస్తం'!

● ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలు ● నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా అక్రమాలు

మార్చి 28న సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూమిలో కడుతున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తున్న మున్సిపల్ అధికారులు

మంచిర్యాల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన అక్రమాల్లో కొందరు హస్తం పార్టీ నాయకులు మునిగి తేలుతున్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఇండ్లు కట్టుకునే వారికి కొందరు లీడర్లు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 42లో నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే దారిలో ప్రభుత్వ భూమిలోనే ఇల్లు నిర్మిస్తున్నారు. దీన్ని గుర్తించిన మున్సిపల్ అధికారులు మార్చి 28వ తేదీన ఆ నిర్మాణాన్ని కూల్చేశారు. అది జరిగి రెండు, మూడు రోజులు కాకుండానే మళ్లీ నిర్మాణ పనులు చేస్తున్నారు. నస్పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఒకరు దీని వెనుక ఉండి నడిపిస్తున్నట్లు సమాచారం. ఇదంతా చూస్తున్న స్థానికులు మొన్నే కూలగొట్టారు, ఈ రోజు మళ్లీ కడుతున్నారు.. ఇదెక్కడి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక ఇదే మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 64 లోని ప్రభుత్వ భూమిలోనూ ఓ అక్రమ నిర్మాణం యథేచ్ఛగా సాగుతున్నది. పరదాలు అడ్డంపెట్టి నిర్మాణం చేస్తున్నా, అటువైపు కన్నెత్తి చూసే నాథుడే లేకుండా పోయారు. జిల్లా మైనార్టీ సెల్‌కు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు ఈ నిర్మాణం వెనుక ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు ఉండడంతో ఏం చేయాలో తెలియక మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. దీనిపై కమిషనర్ సతీశ్‌ను వివరణ కోరగా, సర్వే నంబర్ 42లో నిర్మాణాన్ని కూల్చేశామన్నారు. మళ్లీ కడితే మరోసారి కూల్చేస్తామని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కూల్చిన దగ్గర మళ్లీ సాగుతున్న నిర్మాణ పనులు

సర్వే నంబర్ 64లో సాగుతున్న మరో అక్రమ నిర్మాణం

కేసీఆర్ కాలు బయట పెట్టగానే కాంగ్రెస్‌లో వణుకు

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● రైతుల పక్షాన పోరాడుతామని హామీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 2: రైతుల పక్షాన పోరాడేందుకు కేసీఆర్ కాలు బయట పెట్టగానే కాంగ్రెస్‌లో వణుకు మొదలైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని, పంటలకు సాగు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైఫల్యం వల్లే రైతులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ రైతుల వద్దకు రాగానే, ప్రభుత్వం నిద్ర లేచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాసంగి పంటను బోసస్ ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు. రైతులకు వెంటనే భరోసా కల్పించాలని, అన్యాయం చేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరోసారి కరువు ఆత్మహత్యలను తెచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులను ఆదుకునేందుకు ఇప్పటివరకు ఈ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, నాయకురాలు సరస్వతి, పార్టీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలి

● పంట నష్టం వివరాలు వెంటనే సేకరించాలి
● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా క్వింటాలు ధాన్యానికి రూ. 500 బోనస్‌ను వెంటనే ఇవ్వాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ కరువు నెలకొన్న గ్రామాల్లో పంట నష్టం వివరాలను వెంటనే సేకరించి ఎకరాకు రూ. 25వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. అనేక గ్రామాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని, చేతికొచ్చేదశలో పంటలు నష్టపోవడం రైతాంగాన్ని ఆందోళన కలిగిస్తున్నదని, వెంటనే గ్రామాల వారిగా పంటల నష్టం అంచనాలను అధికారులు తయారు చేయాలని కోరారు. మద్దతు ధరకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఖరీఫ్ నుంచే ఈ బోనస్‌ల చెల్లింపులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గాదె సత్యం, నరేశ్, నాయకులు శ్రీపతిశ్రీనివాస్, గోగుల రవీందర్‌రెడ్డి, ఎస్ మల్లేశ్, రవీందర్, చంద్రశేఖర్ హండే, వంగ తిరుపతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు తరలివెళ్లిన మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు , నాయకులు

వాంకిడి : పట్టుకున్న నగదుతో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్

చెక్‌పోస్టుల్లో నగదు పట్టివేత

రెండు చోట్లా కలిపి రూ. 1.75 లక్షలు స్వాధీనం

వాంకిడి/కాసిపేట, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. మద్యం, నగదు, గంజాయి అక్రమ రవాణాపై పూర్తిస్థాయి నిఘా పెట్టారు. ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని టోల్ ప్లాజా చెక్ పోస్ట్ వద్ద మంగళవారం రూ.లక్ష నగదును పట్టుకున్నట్లు వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపారు. చంద్రపూర్ నుంచి మంచిర్యాల వైపు కారులో వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన వ్యక్తి వద్ద ఈ నగదును కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు పట్టుకున్నట్లు వివరించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్ఐ సాగర్ ఉన్నారు. మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీప చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లికి చెందిన గోలం నరేశ్ వద్ద రూ.75వేలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నగదును ఎస్ఎస్‌టీ టీంకు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

మా భూమిని ఇప్పించండి

రేచిని గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ జగదీశ్‌గౌడ్

తాండూర్, ఏప్రిల్ 2: తమ భూమి ఇప్పించాలని కోరుతూ మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ పరిధిలోని బారేపల్లి గ్రామస్తులు మంగళవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబర్ 41/అ లో 2007 సంవత్సరంలో ఏర్పాటైన ఇందిరమ్మ కాలనీలో తమకు మంజూరైన ఇంటి స్థలాలను మండలంలోని ఒక రాజకీయ నాయకుడు తన పేరు మీద పట్టా చేసుకొని తమకు అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఆందోళన కొనసాగుతుండగానే అదే గ్రామానికి చెందిన ఆది శ్రీనివాస్ తమకు న్యాయం చేయాలని కోరుతూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. తాండూర్ ఏఎస్ఐ లక్ష్మణ్ అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో యువకుడిపై నీళ్లు పోసి రక్షించారు. కాగా, బాధితులు ఆందోళన చేస్తున్న సమయంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ఎన్నికల విధులపై బెల్లంపల్లికి వెళ్లారు. గ్రామస్తులు ఫోన్‌లో సంప్రదించగా, తాను అందుబాటులో లేనని, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎస్ఐ జగదీశ్ గౌడ్ కూడా అక్కడికి చేరుకొని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆందోళనలకు తావు లేదని చెప్పారు. అధికారులతో సంప్రదించి, న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దీంతో తహసీల్దార్ సూచన మేరకు కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేసి గ్రామస్తులు వెనుదిరిగారు.